# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పోస్టల్ బ్యాలెట్లపై రిటర్నింగ్ అధికారి.. అధికారిక ముద్ర లేకపోయినా తిరస్కరించవద్దని అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.**

2. **రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం ధ్రువపత్రాల పరిశీలన రేపటి నుంచి ప్రారంభం కానుంది.**

3. **విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రేపు ప్రారంభమయ్యే హజ్‌యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.**

4. **ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసేందుకు జూన్ 14వ తేదీని తుది గడువుగా యూఐడీఏఐ నిర్ణయించింది.**

5. **ప్రముఖ సంఘ సంస్కర్త, తెలుగు జాతి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం వర్ధంతిని పురస్కరించుకుని ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు.**

==========================

పోస్టల్ బ్యాలెట్లపై రిటర్నింగ్ అధికారి.. అధికారిక ముద్ర లేకపోయినా తిరస్కరించవద్దని అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. రిటర్నింగ్ అధికారి సంతకం ఉన్న వాటిని చెల్లుబాటయ్యే పోస్టల్ బ్యాలెట్లుగా పరిగణించాలని.. అవి చెల్లుబాటు అవుతాయని తెలిపింది. ఫామ్ 13ఏపై రిటర్నింగ్ అధికారి సంతకంతో పాటు అన్ని వివరాలు ఉండాలని స్పష్టం చేసింది. అధికారిక ముద్ర లేదనే కారణంతో పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరించవద్దని.. ఆర్వో సంతకం సహా బ్యాలెట్‌ను ధ్రువీకరించే రిజిస్టర్‌తో సరిపోల్చుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

--------------------------

పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం ధ్రువపత్రాల పరిశీలన రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఏపీ పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఏపీ పాలిటెక్నిక్‌కు చెందిన వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ర్యాంకుల వారీగా రేపటి నుంచి జూన్ 3వ తేదీ వరకూ సమీపంలోని కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థులు నేరుగా హాజరు కావాలి. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు, 5వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుంది. జూన్ 7వ తేదీన సీట్లు కేటాయిస్తారు.

--------------------------

గ్రామాలను తరుచూ సందర్శించి శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి అధికారులకు సూచించారు. ప్రకాశం జిల్లా దర్శి డీఎస్పీ కార్యాలయాన్ని నిన్న రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఐజీ సబ్ డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాలు, అక్కడి తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ముఖ్యమైన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, చెడు నడత కల్గిన వారిని బైండోవర్ చెయ్యాలని, వారిపై నిఘా ఉంచాలని ఐజీ ఆదేశించారు.

-------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో జరిగేలా, సంఘ విద్రోహ శక్తుల ఏరివేతే లక్ష్యంగా పని చేస్తామని చిత్తూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి.ఎన్.మణికంఠ చందోలు తెలిపారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ నేపథ్యంలో చిత్తూరు నగరంలో పోలీసులు ఈరోజు ఉదయం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని.. యువత తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు.

-------------------------

ప్రజలంతా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండాలని అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ కోరారు. ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో నిన్న ఆయన అచ్యుతాపురంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజలు ఘర్షణలు, కొట్లాటలకు దిగడం మంచిది కాదని సూచించారు. జిల్లాలో పోలీస్ చట్టంతో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని.. ఊరేగింపులు, ర్యాలీలు, బాణసంచా పేలుళ్లపై నిషేధం కొనసాగుతోందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చేవారు తప్పకుండా పాసులు కలిగి ఉండాలని.. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టంచేశారు.

-------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రేపు ప్రారంభమయ్యే హజ్ యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రం నుండి మొత్తం 2 వేల 5 వందల మంది ముస్లింలు హజ్ యాత్రకు బయలుదేరి వెడుతున్నారు. వీరిలో 692 మంది విజయవాడ విమానాశ్రయం నుండి వెడతారు. మిగిలిన వారిలో 11 వందల మంది శంషాబాద్ విమానాశ్రయం నుండి.., మరొక ఏడు వందల మంది బెంగళూరు నుండి పయనమవనున్నారు. విజయవాడ నుండి వెళ్ళే హజ్ యాత్రికులు నేరుగా జెడ్డా నగరానికి.. అక్కడ నుండి రహదారి మార్గాన మక్కాకు చేరుకుంటారు. విజయవాడ నుండి హజ్ యాత్రకు వెళ్ళే వారి కోసం గన్నవరం సమీపంలోని కేసరపల్లి గ్రామంలో హజ్ కమిటీ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది.

-------------------------

ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసేందుకు జూన్ 14వ తేదీని తుది గడువుగా యూఐడీఏఐ నిర్ణయించింది. జూన్ 14వ తేదీ తర్వాత ఆధార్ అప్‌డేట్ చేసుకొనేవారు రుసుము చెల్లించాల్సి ఉంటుందని యూఐడీఏఐ తెలిపింది. గత పదేళ్లుగా ఆధార్‌కార్డును ఎలాంటి అప్‌డేట్ చేసుకోనివారు ఈ ఉచిత అప్‌డేట్

సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. జూన్ 14వ తేదీ తర్వాత ఇప్పుడున్న పాత ఆధార్ కార్డు పనిచేయకుండా పోతుందని జరుగుతున్న ప్రచారం అసత్యమే అని యూఐడీఏఐ స్పష్టం చేసింది.

---------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు జాతి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం వర్ధంతి ఈ రోజు. ఈ సందర్భంగా తెలుగు జాతికి ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. 1848 ఏప్రిల్ 16వ తేదీన జన్మించిన కందుకూరికి ఒక వ్యక్తిగా, సంఘ సంస్కర్తగా, రచయితగా అనేక విశిష్టతలు ఉన్నాయి. మొదటి వితంతు వివాహం జరిపించి దేశ ప్రజల హృదయాల్లో ఆయన సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. మొదటి సహ విద్య పాఠశాలను కూడా వీరేశలింగమే ప్రారంభించారు. తెలుగులో తొలి నవల రాసింది కూడా ఆయనే కావడం విశేషం. ఆధునికాంధ్ర సమాజ పితామహునిగా కీర్తి గడించారు. ఆంధ్రప్రదేశ్‌లో బ్రహ్మ సమాజం, యువజన సంఘాల స్థాపనకు నాంది పలికిన కందుకూరి వీరేశలింగం 1919 మే 27వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం ఇకపై ఆన్‌లైన్‌లో జరగనుంది. ప్రస్తుత సప్లిమెంటరీ పరీక్షల నుంచే ఈ నూతన విధానం ప్రారంభం కానుంది. ఈ ఆన్‌లైన్ మూల్యాంకనం కోసం కర్నూలు, తిరుపతి, ఒంగోలు, గుంటూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో ఆరు రీజియన్ స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు డివిజన్‌ను విశాఖ రీజియన్ పరిధిలోకి తీసుకొచ్చారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి డి.శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 40 సెకన్లు.....**

---------------------------

చర్మవ్యాధులపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేందుకు 24 గంటల్లో దేశవ్యాప్తంగా సుమారు పది వేల మంది చర్మవ్యాధుల వైద్యనిపుణులు ప్రతిజ్ఞ చేశారు. ఈ నేపథ్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ సంఘం.. ఐఏ డీవీఎల్ అరుదైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించింది. దేశవ్యాప్తంగా ఈ నెల 5, 6వ తేదీల్లో గుర్తింపు పొందిన 9 వేల 405 మంది చర్మ వైద్య నిపుణులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఈ విషయాన్ని గిన్నిస్ నిర్వాహకులకు పంపగా, ఇంత భారీ సంఖ్యలో ప్రత్యేక వైద్య నిపుణులు దేశవ్యాప్తంగా ప్రతిజ్ఞలో పాల్గొనడాన్ని ప్రపంచ రికార్డుగా నమోదు చేశారు.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఔటర్ రింగ్ రోడ్డులోని శిలాతోరణం వరకు క్యూ లైన్లలో భక్తులు దర్శనం కోసం వేచి ఉన్నారు. తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యాన వనాలలో పాటు.. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఆహారం, పాలు, తాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

======================